నమస్తే తెలంగాణ




# ఐపీవోకి లలితా జ్యువెల్లరీ




న్యూఢిల్లీ, జూన్ 9: ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ లలితా జ్యువెల్లరీ..స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టడానికి సిద్ధమైంది. ఇందుకు సంబంధించి మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకున్నది. ఈ వాటాల విక్రయం ద్వారా గరిష్ఠంగా రూ.1,700 కోట్ల నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. దీంట్లో తాజా షేర్లను జారీ చేయడం ద్వారా రూ.1,200 కోట్లు, కంపెనీ సీఎండీ కిరణ్ కుమార్ జైన్‌కు చెందిన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో విక్రయించడం ద్వారా మరో రూ.500 కోట్లను సేకరించాలని నిర్ణయించింది. ఈ విషయం సెబీకి సమర్పించిన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్‌పెక్టస్(డీఆర్‌హెచ్‌పీ)లో వెల్లడించింది. అర్హత కలిగిన ఉద్యోగులకు రాయితీతో కూడిన షేర్లను కేటాయించనున్నది సంస్థ. ఈ వాటాల విక్రయంతో వచ్చిన నిధుల్లో రూ.1,014.50 కోట్లను నూతన స్టోర్లను ఏర్పాటు చేయడానికి, కార్పొరేట్ అవసరాల నిమిత్తం వినియోగించనున్నట్టు ప్రకటించింది. 1985లో చెన్నైలో తన తొలి స్టోర్‌ను ప్రారంభించిన సంస్థ..ప్రస్తుతం తన స్టోర్ల సంఖ్యను 56కి పెంచుకున్నది. వీటిలో ఆంధ్రప్రదేశ్‌లో 22, తమిళనాడులో 20, కేరళలో ఏడు, తెలంగాణలో ఆరు, పుదుచ్చేరిలో ఒక్క స్టోర్‌ను నిర్వహిస్తున్నది. డిసెంబర్, 2024తో ముగిసిన తొమ్మిది నెలల కాలానికిగా సంస్థ రూ.12,594.67 కోట్ల ఆదాయంపై రూ.262.33 కోట్ల నికర లాభాన్ని గడించింది.

# దిగొస్తున్నాయ్..



**ఆర్ఆర్ఎల్ఆర్, ఎంసీఎల్ఆర్‌లకు కోత పెడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకర్లు**

**10 నుంచి 50 బేసిస్ పాయింట్లదాకా తగ్గింపులు**

**దిగుతున్న లోన్ టెన్యూర్, ఈఎంఐల భారం**

న్యూఢిల్లీ, జూన్ 9: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవలి ద్రవ్యసమీక్షలో రెపోరేటును అర శాతం కోత పెట్టిన నేపథ్యంలో ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులూ తమ రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి. గత వారం జరిగిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రెపోను ఆర్బీఐ 50 బేసిస్ పాయింట్లు తగ్గించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్‌లు రెపో లింక్డ్ లెండింగ్ రేటు (ఆర్ఆర్ఎల్ఆర్) ఆధారిత రుణాలపై, మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్) ఆధారిత లోన్లపై వసూలు చేస్తున్న వడ్డీరేట్లకు 10 నుంచి 50 బేసిస్ పాయింట్లదాకా కత్తెర వేశాయి.

### బ్యాంక్ ఆఫ్ బరోడా

బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) తమ బెంచ్ మార్క్ లెండింగ్ రేటు ఆర్ఆర్ఎల్ఆర్‌ను 50 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. తగ్గిన వడ్డీరేట్లు ఈ నెల 7 నుంచే వర్తిస్తాయని ఈ ప్రభుత్వ రంగ బ్యాంక్ తెలిపింది. ఆర్ఆర్ఎల్ఆర్ అనుసంధానంగా ఈ బ్యాంక్‌లో లోన్లు తీసుకున్న రుణగ్రహీతలందరికీ ప్రయోజనం చేకూరుతుంది. కాగా, ప్రస్తుతం బీవోబీ ఆర్ఆర్ఎల్ఆర్ 8.15 శాతంతో మొదలవుతున్నది.

### హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

ప్రైవేట్ రంగ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ ఎంసీఎల్ఆర్ అన్ని కాలపరిమితులపై 10 బేసిస్ పాయింట్లు తగ్గింది. ఈ నెల 7 నుంచే తగ్గిన వడ్డీరేటు అమల్లోకి వచ్చింది. దీంతో ఎంసీఎల్ఆర్ ఆధారంగా రుణాలు తీసుకున్న రుణగ్రహీతలకు ఈ నిర్ణయం లాభిస్తుంది. కాగా, ప్రస్తుతం ఓవర్‌నైట్, నెల ఎంసీఎల్ఆర్ 8.90 శాతంగా ఉన్నాయి. 3 నెలలది 8.95 శాతానికి, 6 నెలలు, ఏడాది టెన్యూర్ 9.05 శాతంగా ఉన్నాయి. రెండేండ్లు, మూడేండ్లు టెన్యూర్స్‌పై వడ్డీరేటు 9.10 శాతంగా ఉన్నది. ఇదిలావుంటే ఆర్ఆర్ఎల్ఆర్‌నూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 50 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశాలున్నాయి. దీని ఆధారంగా రుణాలు తీసుకున్నవారికి వచ్చే నెల నుంచి ఈ లాభం అందనున్నట్టు తెలుస్తున్నది.

### పంజాబ్ నేషనల్ బ్యాంక్

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ఆర్ఆర్ఎల్ఆర్ 50 బేసిస్ పాయింట్లదాకా తగ్గింది. సోమవారం నుంచే ఇది అమల్లోకి వచ్చింది. దీంతో గృహ రుణాలపై వడ్డీరేటు 7.45 శాతం నుంచి మొదలవుతుండగా, వాహన రుణాలపై 7.80 శాతం నుంచి ప్రారంభమవుతున్నది.

### యూకో బ్యాంక్

అన్ని రకాల టెన్యూర్స్‌పై యూకో బ్యాంక్ ఎంసీఎల్ఆర్ తగ్గింది. తగ్గిన వడ్డీరేట్లు మంగళవారం నుంచి అమల్లోకి వస్తాయని ఈ ప్రభుత్వ రంగ బ్యాంక్ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. నెల ఎంసీఎల్ఆర్ 8.35 శాతానికి, ఓవర్‌నైట్ 8.15 శాతానికి, 3 నెలలు 8.50 శాతానికి, 6 నెలలు 8.8 శాతానికి, ఏడాది ఎంసీఎల్ఆర్ 9 శాతానికి దిగొస్తున్నాయి. అయితే సోమవారం నుంచే ఆర్ఆర్ఎల్ఆర్‌ను 50 బేసిస్ పాయింట్లు తగ్గించినట్టు బ్యాంక్ వెల్లడించింది. ప్రస్తుతం ఇది 8.30 శాతంగా ఉన్నది.

### బ్యాంక్ ఆఫ్ ఇండియా

బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) ఆర్ఆర్ఎల్ఆర్‌ను 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ప్రస్తుతం ఈ వడ్డీరేటు 8.35 శాతంతో మొదలవుతున్నది. తగ్గించిన వడ్డీరేటు ఈ నెల 6 నుంచే అమల్లోకి వచ్చిందని ఈ ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ తెలిపింది.

### కరూర్ వైశ్యా బ్యాంక్

6 నెలల ఎంసీఎల్ఆర్‌ను 10 బేసిస్ పాయింట్లు, ఏడాది ఎంసీఎల్ఆర్‌ను 20 బేసిస్ పాయింట్లు కోతపెట్టి 9.80 శాతానికి తీసుకొచ్చింది ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థ కరూర్ వైశ్యా బ్యాంక్. కొత్త వడ్డీరేట్లు ఈ నెల 7 నుంచే అమల్లోకి వచ్చాయి.

### ఆర్ఆర్ఎల్ఆర్ అంటే?

రెపో లింక్డ్ లెండింగ్ రేటు (ఆర్ఆర్ఎల్ఆర్) ఆర్బీఐ రెపోరేటు ఆధారంగా ఉంటుంది. రిజర్వ్ బ్యాంక్ రెపోరేటును తగ్గిస్తే ఇది తగ్గుతుంది. పెంచితే పెరుగుతుంది. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేట్ల (ఈబీఎల్ఆర్)లో ఆర్ఆర్ఎల్ఆర్ కూడా ఒకటి.

### ఎంసీఎల్ఆర్ అంటే?

మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్)ను ఆర్బీఐ మార్గదర్శకాలను అనుసరించి బ్యాంకులే నిర్ణయిస్తాయి. దీన్ని ఇంటర్నల్ బెంచ్ మార్క్ లెండింగ్ రేటు (ఐబీఎల్ఆర్)గా కూడా పరిగణిస్తారు. బ్యాంక్ ఆర్థిక పరిస్థితి, అందుబాటులో ఉన్న నిధులు, వాటికయ్యే ఖర్చులపై ఈ వడ్డీరేటు ఆధారపడి ఉంటుంది.

## క్వాంటమ్ ఎనర్జీ ప్లాంట్ విస్తరణ


హైదరాబాద్, జూన్ 9: హైదరాబాద్‌కు చెందిన ఈవీ స్టార్టప్ క్వాంటమ్ ఎనర్జీ లిమిటెడ్ తన ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచింది. నగరానికి సమీపంలోని మహేశ్వరం వద్ద ఉన్న ప్లాంట్ కెపాసిటీని 2 లక్షల యూనిట్లకు పెంచుకున్నది. దేశీయంగా కంపెనీకి చెందిన ఈవీలకు డిమాండ్ అధికంగా ఉండటంతో 2.4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నెలకొల్పిన ఈ యూనిట్ సామర్థ్యం పెంచడంతో మరింత మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని కంపెనీ ఎండీ చక్రవర్తి చుక్కపల్లి తెలిపారు. ప్రస్తుతం సంస్థ ప్లాజ్మా, మిలాన్, బిజినెస్ పేర్లతో పలు మాడళ్లను విక్రయిస్తున్నది.

## షిప్‌రాకెట్ డార్క్ స్టోర్

హైదరాబాద్, జూన్ 9: దేశంలో అతి పెద్ద ఈ-కామర్స్ సంస్థల్లో ఒకటైన షిప్‌రాకెట్.. హైదరాబాద్‌లో డార్క్ స్టోర్‌ను ఏర్పాటు చేయబోతున్నది. కస్టమర్లు బుకింగ్ చేసుకున్న వస్తువులను వేగవంతంగా అందించాలనే ఉద్దేశంతో ఇప్పటికే న్యూఢిల్లీ, బెంగళూరు, ముంబైలలో ఈ డార్క్ స్టోర్లను ఏర్పాటు చేయగా..తాజాగా త్వరలో హైదరాబాద్‌తోపాటు చెన్నై, మిగతా నగరాల్లో నెలకొల్పబోతున్నట్లు కంపెనీ సీఈవో అతుల్ మెహతా తెలిపారు. తెలంగాణతోపాటు ఏపీల్లో 18 వేల విక్రయదారులకు సంబంధించిన ఉత్పత్తులను అందుబాటులోవుంచినట్టు చెప్పారు.

## హైదరాబాద్‌లో హైలాండ్ నూతన ఆఫీస్

హైదరాబాద్, జూన్ 9: అమెరికాకు చెందిన టెక్నాలజీ సేవల సంస్థ హైలాండ్..భారత్ తన తొలి కార్యాలయాన్ని హైదరాబాద్‌లో సోమవారం ప్రారంభించింది. అంతర్జాతీయ వ్యాపార విస్తరణలో భాగంగా నగరంలో నెలకొల్పిన ఈ నూతన సెంటర్‌ను అమెరికా కౌన్సిల్ జనరల్ ఫర్ హైదరాబాద్ జెన్నిఫర్ లార్సన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హైలాండ్ సీటీవో టిం మెకింటైర్ మాట్లాడుతూ..హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి టెక్నాలజీ ఎకోసిస్టాన్ని నెలకొల్పినట్టు చెప్పారు.



## 13 నుండి 'స్టైల్ తత్వ'

అమీర్‌పేట్, జూన్ 9 : ఎఫ్ఐసీసీఐ లేడీస్ ఆర్గనైజేషన్(ఎఫ్ఎల్ఓ) హైదరాబాద్ చాప్టర్ నిర్వహిస్తున్న 'స్టైల్ తత్వ' ఐదో ఎడిషన్ ఈ నెల 13, 14 తేదీల్లో హైటెక్స్‌లోని హాల్ 2లో జరగనుంది. సిగ్నేచర్ ఫ్యాషన్, లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన వివరాలను సోమవారం ఎఫ్ఎల్‌వో హైదరాబాద్ అధ్యక్షురాలు ప్రతిభా కుందా వివరించారు. ఈ రెండు రోజుల ఎగ్జిబిషన్‌లో దేశవ్యాప్తంగా 205 మంది పాల్గొంటున్నారని, వీరిలో ఫ్యాషన్, డెకర్, హ్యాండ్‌లుమ్, ఆభరణాలు, హోమ్ లీవింగ్, కళాత్మక ఉత్పత్తుల విభాగాల్లో విస్తృత శ్రేణి ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. 10 వేల మందికి పైగా సందర్శకులు ఈ ఎగ్జిబిషన్లో తిలకించేందుకు వస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు.

## బీమా సంస్థల రికార్డు

న్యూఢిల్లీ, జూన్ 9: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో జీవిత బీమా సంస్థలు రికార్డు స్థాయిలో నూతన బిజినెస్ ప్రీమియంను వసూళ్లు చేశాయి. ఏప్రిల్, మే నెలల్లో జీవిత బీమా సంస్థలు 10.8 శాతం మేర నూతన బిజినెస్ ప్రీమియం వసూళ్లలో వృద్ధిని సాధించాయి. లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఒక మే నెలలోనే 12.6 శాతం వృద్ధిని నమోదు చేసుకోవడం విశేషం. దీంతో గత నెలలో నూతన బిజినెస్ ప్రీమియం ఆదాయం రూ.27,034 కోట్ల నుంచి రూ.30,463 కోట్లకు పెరిగాయి. మొత్తం ప్రీమియం వసూళ్లు రూ.47,293 కోట్ల నుంచి రూ.52,427 కోట్లకు చేరుకున్నాయి.

# నాలుగో రోజూ లాభాల్లో సూచీలు


**సెన్సెక్స్ 255, నిఫ్టీ 100 పాయింట్ల లాభం**

ముంబై, జూన్ 9: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజూ లాభాల్లో ముగిశాయి. రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించడంతో బ్యాంకింగ్, ఆర్థిక రంగ షేర్లలో క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు కూడా మార్కెట్లను ముందుకు నడిపించాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల వరకు లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 256.22 పాయింట్లు అందుకొని 82,45.21 వద్ద ముగిసింది. ఎస్ఎన్ఈ నిఫ్టీ 100.15 పాయింట్లు ఎగబాకి 25,103.20 వద్ద స్థిరపడింది. గడిచిన నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 1,707 పాయింట్లు లేదా 2 శాతం, నిఫ్టీ 560 పాయింట్లు లేదా 2.27 శాతం చొప్పున పెరిగాయి. ప్రతీకార సుంకాలపై అమెరికా-చైనా దేశాల మధ్య మరోసారి చర్చలు జరుగుతుండటం మార్కెట్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది. గడిచిన వారంలో ఆర్బీఐ కీలక వడ్డీరేట్లను అర శాతం తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం మదుపరుల్లో ఉత్సాహాన్ని ఇచ్చిందని, ముఖ్యంగా ఎనర్జీ, ఐటీ, ఆర్థిక రంగ షేర్లు కదంతొక్కాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

- కొటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, ఇండస్‌ఇండ్, మారుతి, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్‌టీపీసీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- కానీ, ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టపోయాయి.

# మారని మైక్రోఫైనాన్స్ సంస్థల తీరు

**అధిక వడ్డీరేట్లు, కఠిన రికవరీలు ఆగట్లేదు: ఆర్బీఐ డీజీ ఎం రాజేశ్వర్ రావు**



ముంబై, జూన్ 9: సూక్ష్మ రుణ సంస్థల్లో (మైక్రోఫైనాన్స్ కంపెనీలు) అధిక వడ్డీరేట్లు, బాకీల వసూళ్లకు అవలంబిస్తున్న కఠిన చర్యలు ఆగట్లేదని, వీటివల్లే మైక్రోఫైనాన్స్ రంగం ఇబ్బందుల్లో పడుతున్నదని ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ల (డీజీ)లో ఒకరైన ఎం రాజేశ్వర్ రావు అన్నారు. ఇటీవల జరిగిన హెచ్ఎస్‌బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఫైనాన్షియల్ ఇంక్లూజన్‌లో మైక్రోఫైనాన్స్ కీలకపాత్ర పోషిస్తున్నదన్నారు. అయినప్పటికీ మైక్రోఫైనాన్స్ కంపెనీల అభ్యంతరకర తీరు మారట్లేదన్నారు. నిజానికి మైక్రోఫైనాన్స్ కంపెనీలకు నిధులు తక్కువ వడ్డీకి, సులువుగా లభ్యమవుతున్నా.. రుణాలపై అధిక వడ్డీరేట్లు వసూలు చేస్తున్నారని, రుణగ్రహీతలపై మితిమీరిన భారం మోపుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు ఎన్నో ఘటనలు సాక్ష్యంగా ఉన్నాయన్న ఆయన.. కొన్ని మైక్రోఫైనాన్స్ సంస్థల అకృత్యాలకు అడ్డుకట్ట పడాల్సి ఉన్నదని వ్యాఖ్యానించారు. వెనుకబడిన ఆదాయ వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఉండాల్సిన మైక్రోఫైనాన్స్ కంపెనీలు.. ధనార్జనే లక్ష్యంగా ముందుకెళ్తుండటం విచారకరమని పేర్కొన్నారు. ఇక బీమా పాలసీలనూ విక్రయిస్తున్నారన్నదానిపై స్పందిస్తూ ఆర్బీఐ దీనికి సంబంధించి తగు మార్గదర్శకాలను విడుదల చేయాలని చూస్తున్నట్టు చెప్పారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 33 మందిపై కేసు నమోదు

- ముగ్గురికి జైలు శిక్ష ●30 మందికి జరిమానా

వినాయక్‌నగర్, జూన్9: ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ పర్యవేక్షణలో పోలీసులు ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ మొత్తం-33 మంది పట్టుబడ్డారు. వారిపై వారికి సోమవారం ట్రాఫిక్ సీఐ కౌన్సిలింగ్ నిర్వహించి అనంతరం మార్నింగ్ కోర్టులో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరుపరిచారు. రాజ్‌పుత్ బాలకృష్ణ, మూల రాజేశ్వర్ అనే ఇద్దరికి మూడు రోజుల చొప్పున జడ్జి జైలు శిక్ష విధించారు. కొత్తూరి గంగాధర్‌కు రెండు రోజులు జైలు శిక్ష విధించారు. మిగతా 30 మంది వాహనదారులకు రూ.57,000 జరిమానా విధించారని వెల్లడించారు.

## అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఇందూరు యువత, పోలీసులు

సుభాష్‌నగర్, జూన్ 9: అనాథ శవానికి ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు. దేవీ థియేటర్ పక్కన ఉన్న సార్వజనిక్ శ్మశాన వాటికలో వారం క్రితం అనారోగ్యంతో అనాథ మృతి చెందాడు. ఒకటో టౌన్ పోలీస్ సిబ్బంది అనుమతితో అంత్యక్రియలు నిర్వహించారు. సేవా సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, కోశాధికారి జయదేవ్, నరేశ్‌రెడ్డి, ఒకటో టౌన్ పోలీస్ సిబ్బంది రాజ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## శతాధిక వృద్ధురాలి మృతి



బుచ్చక్క(ఫైల్)

నవీపేట,జూన్ 9: నాళేశ్వర్ గ్రామంలో శతాధిక వృద్ధురాలు సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పుప్పాల బుచ్చవ్వ(108) మృతురాలు వారం రోజుల క్రితం కూడా ఆరోగ్యంగా ఉండి తన పనులు తాను చేసుకున్నదని, వందేండ్లకు పైగా బతికి మూడు తరాల వారసులను చూసిందని తెలిపారు. బుచ్చవ్వ అంత్యక్రియలకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

## అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ఎత్తివేత

రెంజల్, జూన్ 9: మండలంలోని కందకుర్తి సమీపంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును సోమవారం ఎత్తివేసినట్లు రెంజల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో మహారాష్ట్ర వైపు నుంచి గోవుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్, రెవెన్యూ, పశు సంవర్ధక శాఖల సమన్వయంతో మే 19న చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పండుగ ప్రశాంతంగా ముగియడంతో చెక్‌పోస్టును ఎత్తివేసినట్లు తెలిపారు.

# అనాథ పేరుతో వచ్చి మోసం చేసిన కి'లేడి'

- దంపతుల ఏటీఎం నుంచి డబ్బులు ట్రాన్స్‌ఫర్
- బోధన్‌కు చెందిన వ్యక్తితో కలిసి మోసానికి పాల్పడినయువతి
- పది రోజులకు పోలీసులకు చిక్కిన నిందితురాలు

శక్కర్‌నగర్, జూన్ 9: అనాథ పేరుతో గుంటూరుకు చెందిన ఓ యువతి బోధన్ మండలంలోని నాగన్‌పల్లి గ్రామానికి చెందిన దంపతులకు మాయ మాటలు చెప్పి వారి ఏటీఎం ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని మోసం చేసి సోమవారం బోధన్ పోలీసులకు చిక్కింది. పోలీసుల కథనం.. గుంటూరుకు చెందిన పబ్బులేటి సోని (ప్రత్యూష) అనే యువతి తాను అనాథనని, తన అకౌంట్‌లో రూ.10 లక్షలు ఉన్నాయని, గత నెల 30న బ్యాంకుకు వచ్చిన బోధన్ మండలం నాగన్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ దంపతులను నమ్మించింది. దీంతో వారు సదరు యువతిని అనాథగా భావించి అదే రోజు వారి ఇంటికి తీసుకెళ్లారు. అదే రోజు రాత్రి తన అకౌంట్ పనిచేయడం లేదని, తన బ్యాంకు డబ్బులను వారి అకౌంట్‌కు మార్పిస్తానని వాటిని విత్‌డ్రా చేయించి ఇవ్వాలని వారిని నమ్మించింది. రాత్రి సమయంలో శ్రీనివాస్ భార్యను అకౌంట్ నంబర్, ఏటీఎం కార్డు, పిన్ నంబర్ ఇవ్వాలని కోరగా, వారు ఆమెకు వివరాలు తెలిపారు. వెంటనే ఆమె వారికి తెలియకుండా అదే రాత్రి వారి అకౌంట్ నుంచి రూ.7,49,500 ట్రాన్స్‌ఫర్ చేసింది. ఈ డబ్బులను బోధన్‌కు చెందిన ఐరేండ్ల నరేశ్ సహకారంతో బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసుకుని పరారైంది. ఉదయం సదరు యువతి కనిపించకపోవడంతో శ్రీనివాస్ ముందుగా అకౌంట్ చెక్‌చేసుకున్నాడు. తమ ఖాతా నుంచి డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయినట్లు గుర్తించాడు. వెంటనే ఈ విషయంపై బోధన్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ సీఐ వెంకట నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా, సోమవారం స్థానిక బస్టాండ్‌లో అనుమానాస్పదంగా ఎవరి కోసమో ఓ యువతి వేచిచూస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనలో ఆమె నుంచి రూ.3,80,000 రికవరీ చేయడంతోపాటు రెండు ఐ ఫోన్లు, ఒక ఒప్పో ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలికి సహకరించిన మరో వ్యక్తి ఐరేండ్ల నరేశ్ కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు. నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

### పలుచోట్ల కేసులు..

బోధన్‌లో నాగన్‌పల్లి గ్రామానికి చెందిన దంపతులను మోసం చేసిన యువతి పాతనేరస్థురాలని సీఐ వెంకట నారాయణ వెల్లడించారు. నిజామాబాద్‌లోని టౌన్-3, నందిగామ, మాదాపూర్ పోలీస్ స్టేషన్లతో పాటు పలు ప్రాంతాలలో ఇదే తరహాలో సైబర్ నేరాలకు పాల్పడి జైలుకు వెళ్లివచ్చిందని తెలిపారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా బ్యాంకుల వద్ద డబ్బుల విషయంలో, సైబర్ నేరగాళ్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులతో బ్యాంకు లావాదేవీలపై, ఇతర వివరాలపై చర్చించవద్దని ఆయన సూచించారు.

## వాహనాల చోరీకి పాల్పడిన ఇద్దరి అరెస్ట్

- మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం

వినాయక్‌నగర్, జూన్ 9 : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వాహనాల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఖలీల్‌వాడిలోని ఓ ప్రైవేట్ దవాఖాన ఎదుట నిలిపి ఉంచిన తన ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు బాధితులు శంకర్ ప్రసాద్ రెండు రోజుల క్రితం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నగరంలోని బోధన్ బస్టాండ్ వద్ద సోమవారం వాహనాల తనిఖీ చేపడుతుండగా.. వాహనధ్రువపత్రాలు చూపించకుండా పారిపోయేందుకు యత్నించిన ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. నిందితులను కోటగిరి మండలానికి చెందిన తాటి గొల్ల గోపాల్, నగరంలోని వెంగళ్‌రావు నగర్‌కాలనీకి చెందిన అర్బాజ్ అలియస్ జాఫర్‌గా గుర్తించారు. చోరీ చేసిన మూడు ద్విచక్రవాహనాలను వీరి నుంచి స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో వెల్లడించారు. వీరిపై గతంలో కూడా బైక్ చోరీల కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు.

## దాడి కేసులో పలువురిపై కేసు నమోదు

ఇందల్వాయి/ వినాయక్‌నగర్, జూన్ 9: ఇందల్వాయి పోలీసుస్టేషన్ పరిధిలోని సిర్నాపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి కొందరు అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటిపై దాడి చేశారు. కుటుంబ సభ్యులపై దాడిచేసి ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. ఈ విషయమై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. సదరు కుటుంబంపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంఐఎం నాయకుల ఆధ్వర్యంలో సీపీ సాయి చైతన్యకు ఫిర్యాదు చేశారు.

## రెండు తలలు, ఆరు కాళ్లతో దూడ జననం

శక్కర్‌నగర్, జూన్ 9: బోధన్ పట్టణంలోని రాకాసీపేట్‌లో ఓ రైతు ఇంట్లో వింత దూడ సోమవారం జన్మించింది. రాములు అనే రైతుకు చెందిన గేదెకు రెండు తలలు, ఆరు కాళ్లతో దూడ జన్మించింది. ఈ అరుదైన సంఘటనను చూసేందుకు పలువురు రైతు ఇంటికి వచ్చారు. ఈ దూడ జన్మించిన కొంత సమయానికే మృతి చెందింది.

## రైస్‌మిల్లును తరలించాలి

మోర్తాడ్, జూన్ 9 : కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలో జనావాసాల మధ్య ఉన్న రైస్‌మిల్లును మూసివేయడం లేదా ఇతర చోటికి తరలించాలని ఉప్లూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. రైస్‌మిల్లు ద్వారా వస్తున్న వ్యర్థాలు, దుమ్ముతో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి, తహసీల్దార్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైస్‌మిల్‌ను జనావాసాల మధ్య నుంచి తరలించాలని కోరారు.



సొసైటీ చైర్మన్ న్యాలకంటి అబ్బన్నను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు ఆర్.రాంకిషన్‌రావు, పార్టీ నాయకులు



సొసైటీ చైర్మన్‌ను పరామర్శిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు తదితరులు

## సొసైటీ చైర్మన్‌కు పరామర్శ

నవీపేట,జూన్ 9: మండలంలోని అబ్బాపూర్(ఎం) గ్రామంలో నవీపేట సొసైటీ చైర్మన్ న్యాలకంటి అబ్బన్నను బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు ఆర్.రాంకిషన్‌రావు, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, బీఆర్ఎస్ నాయకులు సోమవారం పరామర్శించారు. చైర్మన్ తల్లి అమ్మాయి ఇటీవల గుండె పోటుతో మృతిచెందగా.. పరామర్శించి, ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తెడ్డు పోశెట్టి, తెలంగాణ శంకర్, మాజీ ఎంపీటీసీ న్యాలకంటి సాయిలు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే గేట్‌మన్ ఆత్మహత్య

- మహంతం రైల్వే గేటు రూములో ఘటన
- మృతుడు రాజస్థాన్ రాష్ట్రంలోని దసువా వాసి



విజేయొంద్ర కుమార్ భైర్వ(ఫైల్)

నవీపేట, జూన్ 9: మండలంలోని మహంతం రైల్వే గేటులో ఎల్‌సీ గేట్ నంబర్ 189లో విధులు నిర్వహించే రైల్వే గేట్‌మన్ సోమవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిజామాబాద్ రైల్వే ఏఎస్సై సాయారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రంలోని దసువా గ్రామానికి చెందిన రైల్వే గేట్‌మన్ విజేంద్రకుమార్ భైరవ(29) ఏడాది క్రితం రాజాస్థాన్ నుంచి బదిలీపై నవీపేట మండలంలోని మహంతం రైల్వే గేట్‌లో విధులు నిర్వహించేందుకు వచ్చాడు. విధులు నిర్వహించే గదిలోనే తెల్లవారుజామున సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి వివాహం కాలేదు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. నిజామాబాద్ రైల్వేస్టేషన్ మాస్టర్ హరికృష్ణ ఫిర్యాదు మేరకు మృతదేహానికి పంచనామా చేసి, పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

## అప్పుల బాధతో ఒకరు..



భాస్కర్ (ఫైల్)

రామారెడ్డి, జూన్ 9: అప్పుల బాధతో మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. స్థానిక ఎస్సై రాజారాం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఆర్గోండ భాస్కర్(33) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలం క్రితం ఓ ఇల్లును కొనుగోలు చేయగా అప్పులయ్యాయి. దీంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 5న బస్వాపూర్‌లో ఉంటున్న బంధువుల ఇంట్లో శుభ కార్యానికి భార్య భాగ్య, ఇద్దరు కొడుకులు వెళ్లగా.. భాస్కర్ ఇంటివద్దనే ఉన్నాడు. ఆదివారం మృగశిరా కార్తె సందర్భంగా మటన్ తీసుకొని బస్వాపూర్‌కు వెళ్లి, భోజనం చేసి తిరిగి రామారెడ్డికి వచ్చాడు. 'నేను చనిపోతున్నాను..పిల్లలను జాగ్రత్తగా చూసుకో..' అంటూ భార్యకు మెస్సేజ్ పంపించి ఇంట్లోని దూలానికి తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భర్త పంపిన మెస్సేజ్‌ను చూడని భార్య సోమవారం ఉదయం తన భర్తకు పలుమార్లు ఫోన్ చేసినా లిఫ్టు చేయలేదు. కుల పెద్దలకు చేయగా వారు ఇంటికి వచ్చి చూడగా భాస్కర్ ఉరేసుకొని కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జనరల్ దవాఖానకు తరలించినట్లు చెప్పారు.

## కుమారుడు డబ్బులు పంపడం లేదని తల్లి ..

వినాయక్‌నగర్, జూన్ 9 : ఇతరులకు చెల్లించాల్సిన డబ్బులు పంపమని కుమారుడిని అడగగా.. సరైన సమాధానం ఇవ్వకుండా డబ్బులు పంపకపోవడంతో మనస్తాపం చెందిన తల్లి.. ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజామాబాద్ నగరంలో సోమవారం చోటు చేసుకున్నది. మూడో టౌన్ ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని చంద్రశేఖర్ కాలనీలో ఉండే హోలియా లక్ష్మి అలియాస్ బాల్‌గిరి లక్ష్మి (44) భర్త కొంతకాలం క్రితం మృతిచెందాడు. ఆమె కుమారుడు రోహిత్ బతుకుదెరువు కోసం దుబాయికి వెళ్లాడు. రోహిత్ కొన్ని డబ్బులు పంపగా వాటితో హోలియా లక్ష్మి నగరంలోని ఓ ఇల్లు కొన్నది. మరికొంత డబ్బు కోసం రోహిత్‌ను అడగగా.. అతడు సరిగ్గా ఫోన్ మాట్లాడకపోవడం, డబ్బులు అందకపోవడంతో మనస్తాపం చెందిన ఆమె తన ఇంట్లో చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. సమాచారం అందుకున్న ఎస్సై ఘటనా స్థలాన్ని పరిశీలించాచి, మృతురాలి కుమారుడికి సమాచారం అందించారు. మృతదేహాన్ని జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు.

## ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

నందిపేట్, జూన్ 9 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తానన్న ఆరు గ్యారెంటీల్లో భాగంగా వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ. 12 వేలు ఇచ్చి ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ నాయకుడు గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలని, ఉపాధి కార్మికులకు నాలుగు వారాలుగా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వెంటనే డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజలింగం, లస్మన్న, పుష్ప, గంగవ్వ పాల్గొన్నారు.

## విద్యార్థిని అదృశ్యం



ఇషా పంకజ్ పటేల్

బాల్కొండ, జూన్ 9 : కిసాన్‌నగర్ గ్రామానికి చెందిన యువతి ఇషా పంకజ్ పటేల్ అదృశ్యమైనట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఈనెల 7న 10 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లి.. తిరిగి రాలేదని తండ్రి పంకజ్ పటేల్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 87126 59860 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.